నేడు, రేపు జాతీయ సెమినార్

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగరంలోని స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో నేటి నుంచి రెండు రోజుల పాటు సిఐటియు జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. సిఐటియు జాతీయ నాయకులు పర్వా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్న సదస్సుకు సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వర్గంపై దాడి–పరిష్కారాలు అంశంపై ప్రసంగించనున్నారు. ఆమెతో పాటు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వి నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు హాజరు కానున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సెమినార్‌లో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నారు.

'మిచౌంగ్' గుబులు

- మూడు రోజుల పాటు జిల్లాకు వర్ష సూచన
- కళ్లాల్లోనే ధాన్యం
- తుపాను హెచ్చరికతో అన్నదాతల్లో ఆందోళన
- అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పొలాల్లో : వరి కుప్పలు పెడుతున్న రైతులు

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శనివారం జిల్లాలో వాతావరణం మారింది. వాయుగుండం తుపానుగా మారి జిల్లాలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మిచౌంగ్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతల్లో గుబులు రేగుతోంది. తుపాను ప్రభావంతో జిల్లాపై ఉండనుందన్న వార్తలు రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే కోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో తుపాను హెచ్చరికలు రావడంతో రైతులు పొలాలకు పరుగులు పెడుతున్నారు. కోత పూర్తయిన ధాన్యాన్ని పొలాల నుంచి కళ్లాలకు తరలిస్తున్నారు. కళ్లాల్లో ధాన్యాన్ని కుప్పలుగా పోసి టార్పాలిన్లు కప్పుతున్నారు. తడి ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఇంకా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో, వాటిని కాపాడుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

'మిచౌంగ్'పై అధికారులు అప్రమత్తత

'మిచౌంగ్'గా నామకరణం చేసిన తుపానుపై జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంతో ఈనెల 3, 4, 5 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారని కలెక్టర్ తెలిపారు. రైతులు పంటలు జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. తీరప్రాంత మండలాల్లో మత్స్యకారులు సముద్రంలోకి వేట వేటకు వెళ్లకుండా తహశీల్దార్లు గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. మత్స్యకారులు బోట్లను, వలలను, పడవలను జాగ్రత్తపర్చుకోవాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేయాలన్నారు. జనరేటర్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు భయపడకుండా జాగ్రత్తగా ఇళ్లలోనే ఉండాలన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అత్యవసర సమయంలో 08942-240557 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. అవసరమైన సామగ్రి సిద్ధం చేసుకోవాలని తహశీల్దార్లకు సూచించారు. తుపాను గాలుల సమయంలో ఎవరూ బయటకు రాకూడని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర ఉండొద్దని చెప్పారు. వైద్యారోగ్య, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, రహదారులు భవనాలశాఖల అధికారులు, సిబ్బంది కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు అవసరమైన మందులను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 108 వాహనాలు అన్ని మండలాల్లో సిద్ధంగా ఉన్నాయని, అత్యవసర సమయంలో వినియోగించుకోవాలని సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ జయదేవి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్, మున్సిపల్ కమిషనర్లు, మత్స్యశాఖ, పంచాయతీరాజ్, పౌర సంబంధాలశాఖ ఎస్ఇ, వంశధార, ఇరిగేషన్, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు సమాధానం లేని సమావేశమెందుకు?

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే కళావతి అసహనం
- ఇళ్ల బిల్లులను క్లియర్ చేయకుంటే ప్రభుత్వంపై అభాండాలు
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

తాము లేవనెత్తిన సమస్యలకు సమాధానం ఇవ్వలేని సమావేశాలు ఎందుకని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కళావతి ప్రశ్నించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. గృహనిర్మాణ శాఖపై చర్చ సందర్భంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన పలు మండలాల్లోని సమస్యలపై ప్రస్తావించడానికి సిద్ధమైన తరుణంలో ఆయా జిల్లాలకు సంబంధించిన అధికారులు గైర్హాజరు కావడంపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బదులిస్తూ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇక్కడి జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు విజయనగరం జెడ్‌పి సమావేశానికి వచ్చే అవకాశం లేదని, అక్కడి అధికారులు ఇక్కడి సమావేశానికి హాజరు కాకపోతే తామడిగిన ప్రశ్నలకు ఎవరు సమాధానం ఇస్తారని ప్రశ్నించారు. టెక్నికల్‌గా సమాధానం చెప్తే సరిపోదని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ ప్రతిసారీ సమస్యలను ప్రస్తావిస్తున్నా పరిష్కరించడం లేదని, బదులు చెప్పేందుకు అధకారులు రావడం లేదంటూ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. తామేమీ మాట్లడమని ఏదో ఒకటి తేల్చాలంటూ చెప్పారు. విద్యాశాఖపై చర్చ సందర్భంగా విజయనగరం జిల్లా నుంచి సూపరింటెండెంట్, పార్వతీపురం జిల్లా నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ హాజరు కావడం, వారు సమాధానాలేమీ చెప్పలేకపోవడంతో మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము స్వయంగా ఫోన్ చేసి రావాలని చెప్పామని ఛైర్‌పర్సన్ పిరియా విజయ, సిఇఒ ఆర్ వెంకట్రామన్ బదులిచ్చారు.

ఇళ్ల బిల్లులను క్లియర్ చేయకుంటే చెడ్డ పేరు

లబ్ధిదారులకు చెల్లించాల్సిన ఇళ్ల బిల్లులను వెంటనే క్లియర్ చేయకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయంటూ పలువురు సభ్యులు లేవనెత్తారు. దీనిపై ఆయన వివరాలు అడిగి తెలుసుకుని డబ్బులు చెల్లించపోతే అధికారులను ప్రజలు నిలదీస్తారన్నారు.

జగనన్న కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం లేదని రణస్థలం జెడ్‌పిటిసి సభ్యుడు టి.సీతారాముడు లేవనెత్తారు. జగనన్న కాలనీలకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారని కంచిలి ఎంపిపి దేవదాస్ రెడ్డి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

అవసరం ఉన్న స్కూళ్లకు నిధులు ఇవ్వడం లేదు

నాడు–నేడు కింద అవసరం ఉన్న స్కూళ్లకు నిధులు ఇవ్వడం లేదని పలువురు జెడ్‌పిటిసి సభ్యులు ప్రస్తావించారు. రణస్థలం మండలం కుమ్మరిపేట, సంతబొమ్మాళి మండలం కె.లింగోడు గ్రామాల్లో పాఠశాలలు పూర్తిగా శిథిలమయ్యాయని, వాటికి నాడు–నేడు కింద నిధులు కేటాయించాలని కోరారు. స్థానిక పరిస్థితులకనుగుణంగా పాఠశాలలకు నిధులు కేటాయించకుండా ఉన్నతాధికారుల వద్ద ఉన్న వివరాల ప్రకారం నిధులు కేటాయించడం సరికాదని స్పీకర్ సీతారాం అన్నారు.

పంచాయతీరాజ్ అధికారులపై అసహనం

రహదారుల నిర్మాణంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులపై పలువురు సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి ఎంపీ ల్యాడ్ నిధులిచ్చినా పనులు చేయడం లేదని ఎంపీ చంద్రశేఖర్ అన్నారు. మండలాల నుంచి వస్తున్న గడప గడపకు పనుల ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు పంపించాలని జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. దీనిపై సిపిఒ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ప్రతిపాదనలను సకాలంలో పంపిస్తున్నా, వాటి అప్రూవల్‌కు కొంత సమయం పట్టడం వల్లే జాప్యమవుతోందని బదులిచ్చారు.

అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం

ప్రాధాన్యత ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడకుండా బిల్లులకు సంబంధించిన అంశాలపైనే అంతా మాట్లాడుతున్నారని హిరమండలం జెడ్‌పిటిసి బుచ్చిబాబు అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్వాసితులకు మీరేం చేశారని రణస్థలం జెడ్‌పిటిసి సభ్యుడు సీతారాముడు ప్రశ్నించడంతో ఇరువరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే కృష్ణదాస్ మాట్లాడుతూ టిడిపి 14 ఏళ్లలో జిల్లాకు ఏం చేసిందో అందరికి తెలుసని, ప్రభుత్వాన్ని విమర్శించి లబ్ధి పొందాలని చూడొద్దన్నారు.

దిశ సమావేశానికి పిలవకపోవడమేమిటి?

దిశ జిల్లా కమిటీ సభ్యుడిగా ఉన్న తనను సమావేశానికి పిలవకపోవడమేమిటని జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ నిలదీశారు. సమావేశం సమాచారం తెలియజేశామని బదులివ్వడంతో, తాము అందుబాటులో ఉన్నప్పుడు సమావేశం పెట్టాలి కదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తమ్మినేని చెవిలో తనయుడి గుసగుసలు

జెడ్‌పి సమావేశంలో స్పీకర్ సీతారాం తనయుడు చిరంజీవి హల్‌చల్ చేయడం కనిపించింది. తొలుత సమావేశం వేదికపై కూర్చొన్నారు. తర్వాత అధికారులు కూర్చొనే సీట్ల వద్దకు వెళ్లి వారితో కలిసి కూర్చొన్నారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి చర్చ జరుగుతున్న సందర్భంలో రెండు, మూడు పర్యాయాలు తమ్మినేని చెవిలో ఏదో చెప్తుండడం కనిపించింది. సమావేశంలో ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, కంబాల జోగులు, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోయే ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరానికి జిల్లాలో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రికెట్ నెట్ ప్రాక్టీస్‌లో స్థానిక యువతతో కలిసి శనివారం ఉదయం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా ప్రతి సచివాలయం పరిధిలో వాలంటీర్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో ఈ నెల 15 నుంచి క్రీడల నిర్వహణ మొదలు కానున్నట్టు పేర్కొన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 15 ఏళ్లు పైబడిన ఆసక్తి కలిగిన వారు వెబ్‌సైట్, యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడల నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఇందులో పురుషులకు, మహిళలకు విడివిడిగా క్రీడలు నిర్వహిస్తారని అన్నారు. 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు క్రికెట్, కబడ్డీ ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ 5 అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తారని అన్నారు. ఐదు క్రీడ అంశాలే కాకుండా స్థానికంగా సంప్రదాయ క్రీడలనూ నిర్వహించనున్నట్లు తెలిపారు. సచివాలయం స్థాయిలో క్రీడలన్నీ 12 రోజుల పాటు కొనసాగుతాయని చెప్పారు. ఈ క్రీడల్లో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొందుకు అర్హులు కాదన్నారు. నియోజకవర్గంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో నాలుగు అంశాల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.35 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు నగదు బహుమతి ఇస్తారని చెప్పారు. జిల్లాస్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ.60 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు మొదటి బహుమతి రూ.5 లక్షలు, రెండో బహుమతి రూ.3 లక్షలు, మూడో బహుమతి రూ.2 లక్షలు ఇవ్వనున్నారని తెలిపారు. క్రీడలు ఆడేందుకు అవసరమైన అన్ని క్రీడా సామగ్రిని అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, కోచ్ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రాక్టీస్ మ్యాచ్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

నేడు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

టెక్కలి : జాతీయ ఉపకార వేతనం ఎంపిక (ఎన్‌ఎంఎంఎస్) నిమిత్తం కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ ఎంపిక పరీక్ష ఆదివారం జరగనుంది. జిల్లాలోని మూడు డివిజనర్ల పరిధిలో 24 కేంద్రాలు ఎంపిక చేశారు. ఈ ప్రవేశ ఎంపిక పరీక్షకు జిల్లాలోని 30 మండలాల నుంచి 5,525 మంది విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది నూతనంగా పలాస డివిజన్ కేంద్రం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించనున్నారు. తాజాగా ఏర్పాటు చేసిన పలాస డివిజన్ పరిధిలోకి ఇచ్ఛాపురం నుంచి నందిగాం మండలాలకు చెందిన విద్యార్థులు హాజరు కానున్నారు. జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక నిమిత్తం నిర్వహించబోయే పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఆయా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఉదయం పది గంటల నుంచి పన్నెండున్నర వరకు పరీక్ష నిర్వహించనున్నారు. హాజరు కాబోయే విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ఒక్కో కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు ఒక డిపార్ట్‌మెంట్ అధికారి, ఇన్విజిలేటర్లను నియమించారు. అధిక శాతం మంది వ్యాయామ ఉపాధ్యాయులనే ఇన్విజిలేటర్లుగా నియమించారు.

పరీక్షా కేంద్రాలు ఇవే..

జిల్లాలో నిర్వహించనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహణకు శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని పలు పాఠశాలల నుంచి హాజరు కానున్న విద్యార్థులకు ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు, పిఎస్ఎన్ఎం పాఠశాల, న్యూసెంట్రల్ స్కూల్, చైతన్య, భాష్యం, గీతాంజలి, కేశవరెడ్డి, ప్రభుత్వ మహాత్మా జ్యోతీబా పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు కేటాయించారు. టెక్కలి డివిజన్‌కు సంబంధించి మహాత్మాజ్యోతీబా పూలే బాలికల గురుకుల పాఠశాల, రవీంద్ర భారతి, బిఎస్‌జెఆర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఆర్‌సిఎం పాఠశాలలు కేంద్రాలుగా నిర్వహించారు. పలాస డివిజన్‌లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాశీబుగ్గ ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య, గురుకులం, ఎస్ఎఫ్ఎస్, నారాయణ, భాష్యం పాఠశాలలు కేంద్రాలుగా ఎంపిక చేశారు.

ఆమదాలవలస : దరఖాస్తులను పరిశీలిస్తున్న జెసి నవీన్

అర్హులందరికీ ఓటు హక్కు

ప్రజాశక్తి– ఆమదాలవలస, బూర్జ

18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బిఎల్‌ఒలపై ఉందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ఓటర్ల ప్రత్యేక క్యాంపైన్ డే సందర్భంగా మండలంలోని రామచంద్రాపురం, పొన్నాంపేట, దన్నానపేట, కొండపేట పోలింగ్ స్టేషన్లను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఓటరు జాబితా అవగాహనా సదస్సులో రాజకీయ పార్టీల నాయకులు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై స్పందించి పరిష్కరించాలన్నారు. మార్పులు, చేర్పులు, డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్ల తొలగింపు దరఖాస్తులపై సమగ్ర విచారణ చేపట్టి బిఎల్‌ఒలు సకాలంలో చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా విధులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంట తహశీల్దార్ ఎస్.గణపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మురళీధర్‌నాయక్, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బూర్జ మండలం కొండపేట పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఓటరు చేర్పులు, మార్పుల్లో ఎటువంటి విమర్శలకు తేవలేకుండా చూడాలని ఆదేశించారు. ఓటర్ల నమోదు, తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించాలన్నారు. ఈయనతో పాటు తహశీల్దార్ రమణారావు, ఎన్నికల డిటి కె.కృష్ణ, విఎల్ఒ వి.గోవిందరావు ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు జరిపిన పిదప వివరాలు వెల్లడించడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి పేర్కొన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం అమలుపై డిఎంహెచ్ఒ కార్యాలయంలో జిల్లాస్థాయి సలహా మండలి సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘిస్తున్న స్కానింగ్ సెంటర్లపై, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, సెంటర్ల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. గర్భస్థ శిశు స్థితిగతులు, సమస్యలు తెలుసుకునేందుకే స్కానింగ్‌లు చేయాలే తప్ప, వీటిని ఆసరాగా తీసుకుని గర్భస్థ శిశు వివరాలు వెల్లడించడం నేరమన్నారు. జిల్లాలో 108 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి స్కానింగ్ సెంటరులో సిసి కెమెరాల ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయా కేంద్రాలపై ప్రోగ్రాం అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఇకపై ప్రతి ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో జరిగే అబార్షన్ల వివరాలతో పాటు అందుకు తగిన కారణాలను తమకు సమర్పించాలని స్పష్టం చేశారు. సమాజంలో బాల బాలికలిద్దరూ సమానమేనని, స్త్రీలపై వివక్ష ఉండరాదని వివరించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు నిష్పత్తి పురుషులతో పోలిస్తే తక్కువగా ఉన్నారని, పురుషుల నిష్పత్తితో సమానంగా మహిళలు ఉండే విధంగా కృషి చేయాలని అన్నారు. విశ్రాంత న్యాయమూర్తి పి.జగన్నాథం మాట్లాడుతూ దేశంలో మంచి చట్టాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే సమాజం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ బి.అనురాధ మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణపై గ్రామస్థాయి నుంచే అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ ఎస్.సూర్యకళ, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డిఐఒ ఈశ్వరిదేవి, డిప్యూటీ డెమో ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ మోహనరావు, డాక్టర్ మంత్రి వెంకట స్వామి, హెల్త్ ఎడ్యుకేటర్స్ మోహిని పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి నివారణపై దృష్టి

శ్రీకాకుళం అర్బన్ : ఉద్దానం కిడ్నీ వ్యాధి నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షతన జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ వ్యాధి నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను పర్యవేక్షించడానికి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిని నివారించడానికి అన్ని ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు చర్యలు తీసుకోవాలని కోరారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఉద్దానం ప్రాంతంలోని ఫ్యాక్టరీలు నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫుడ్ కంట్రోల్ అధికారులను ఆకస్మికంగా తనిఖీ చేపట్టి నాణ్యతలేని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర ఆహార పదార్థాలు విక్రయించే వారిపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ గణపతి, సోంపేట మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాదరావు, డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రరావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీరాములు, నెఫ్రాలజిస్టు డాక్టర్ విద్యాసాగర్, డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులు ఆందోళన చెందొద్దు

శ్రీకాకుళం అర్బన్ : ఎస్‌బిఐ గార శాఖలో 60 గోల్డ్ లోన్ బ్యాగులు మాయంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని డిజిఎం పంకజ్‌కుమార్ తెలిపారు. ఖాతాదారులకు ఇప్పటికే దీనికి సంబంధించిన సరైన సమాచారం అందించామన్నారు. ఖాతాదారుల ప్రయోజనాలను బ్యాంకు చూసుకుంటుందని, ఖాతాదారులెవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూస్తామని అన్నారు. 86 మిస్డ్ బ్యాగ్‌లలో, 26 ఇప్పటికే రికవరీ చేశామన్నారు. వాటిలోని వస్తువులు సక్రమంగా ఉన్నాయని ధృవీకరించామన్నారు. మిగిలిన బ్యాగ్‌ల రికవరీ ప్రక్రియ సరైన సమయంలో చేపడతామన్నారు. ఈ 60 బ్యాగులు మినహా గార బ్రాంచ్‌లో తాకట్టు పెట్టిన మిగిలిన బంగారమంతా సురక్షితంగా ఉందన్నారు. బంగారు రుణాలు తిరిగి చెల్లించే వినియోగదారులందరికీ వారి వస్తువులను డెలివరీ చేస్తామన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. బ్యాంకుపై తమ పూర్తి విశ్వాసం చూపుతున్న వినియోగదార్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఖాతాదారులెవరూ నష్టపోవాల్సిన అవసరం ఉందన్నారు. మరిన్ని వివరాలకు9930990927 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

గజిబిజి రాజకీయ చిత్రం

ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు మరో వంద రోజుల గడువు మాత్రమే ఉంది. జిల్లాలో రాజకీయాలు ప్రధానంగా అధికార పార్టీ రాజకీయాలు, ముఖ్య అభ్యర్థుల ఎంపికలో రోజురోజుకూ గజిబిజి పెరుగుతోంది. సగం నియోజకవర్గాల్లో అభ్యర్థుల వేట అధినేతకు తలనొప్పులు తెప్పిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు, ఐప్యాక్ నివేదికలు... ప్రభుత్వ, ప్రయివేటు ఇంటెలిజెన్స్ సమాచారాలను క్రోడీకరిస్తున్న నేతలు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారని తెలిసింది. ఎవరినీ వదులుకోనని, పనితీరు బాగాలేకపోతే టిక్కెట్ ఉండదు తప్ప మరోవిధంగా ఇముడ్చుకుంటానని జగన్ పలు సందర్భాల్లో ప్రస్తావించినా, జిల్లాలో కొందరు నేతలకు ఆ మాటలు ఉపశమనం కలిగించడం లేదు. జిల్లాలో పార్లమెంట్ అభ్యర్థి విషయంలో వైసిపిలో కొత్త ప్రచారం మొదలైంది. జిల్లాకు చెందిన ఓ ఐఎఎస్ అధికారి మరో రెండేళ్లలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఎంపీ టిక్కెట్ ఇస్తామని అధినేత నుంచి కచ్చితమైన భరోసా ఇస్తే ఉద్యోగ విరమణ చేయడానికి ఆయన సిద్ధంగా ఉన్నారని తెలిసింది. గతంలో ఆయన సోదరుడు పార్లమెంట్ అభ్యర్థిగా టిక్కెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ప్రచారంలో విశ్వసనీయత కన్నా అందుకు అవకాశాలు ఉన్నట్లు జరుగుతున్న పరిణామాలు, మారుతున్న రాజకీయాలు వెల్లడిస్తున్నాయి. దీంతో ధర్మాన కృష్ణదాస్ ఎంపీ అభ్యర్థి అన్న ప్రచారానికి తెరచాటు అయిందని భావించే పరిస్థితి వచ్చింది. ఎంపీ అభ్యర్థి ఎంపిక అధికార పార్టీకి పెద్ద ఫజిల్‌గా తయారైందని, మారుతున్న వ్యూహాలకు అడ్డం పడుతోంది. జనవరిలో బటన్ నొక్కడానికి ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నట్లు అమరావతి వర్గాల సమాచారం. అప్పటికే సీట్లు ఖరారయ్యే అవకాశం కనిపిస్తుంది.

శాసనసభ నియోజకవర్గాల పరిస్థితి అందుకు భిన్నంగా లేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నర్తు రామారావును శాసనమండలికి పంపడం ద్వారా పార్టీలో ఐక్యత సాధించవచ్చని నేతలు భావించారు. ఆ భావన వాస్తవ రూపం దాల్చలేదు. జిల్లాకు చెందిన ముఖ్య నేతలు ఇద్దరు ఆ నియోజకవర్గంతో చదరంగం ఆడుతున్నారు. ఒక నేత ఇప్పటికే ప్రచారంలో ఉన్న అభ్యర్థికి మద్దతునిస్తూ పావులు కదుపుతున్నారు. మరోవైపు ఆయనపై ఉద్యోగాలు ఇస్తామని కట్టలు వసూలు చేసినట్లు ప్రచారం ఉంది. దాన్ని ఆసరా చేసుకుని మరో ముఖ్య నేత జిల్లాలో పేరున్న ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్‌ను తీసుకొచ్చి బరిలో దించాలన్న ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది. అయితే ఆయనకు అంగబలం, అర్థబలం చాలదన్న అభిప్రాయం కొందరిలో ఉంది. పాతపట్నం నియోజకవర్గ అభ్యర్థిని మారుస్తారన్న ప్రచారం రోజురోజుకూ పెరుగుతోంది. ఆ నియోజకవర్గంపై స్థానికేతరులు దృష్టిసారించినా, నియోజకవర్గ నేతలకే టిక్కెట్ ఇవ్వాలన్న సూచనలు జిల్లా నేతల నుంచి అధినేతకు వెళ్లాయని తెలిసింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలోనూ అసమ్మతిరాగం వినిపిస్తున్నా, వేచిచూద్దామన్న ధోరణిలో అధినేత వ్యవహరిస్తున్నారని సమాచారం. జిల్లాలో మరో ఇద్దరు ముఖ్య నేతలపై అవినీతి ఆరోపణల నివేదికలు ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి ముఖ్యమంత్రికి చేరాయని తెలిసింది. ఆ నేతల కుటుంబసభ్యులు గల్లా పెట్టెలో కాసులు వసూలు చేస్తున్నారన్నది ఆ నివేదికలో సారాంశం. అందువల్ల కీలకమైన ఇద్దరు నేతల విషయంలో సర్వే నివేదికలతో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. అన్నింటికన్నా ముఖ్యమైన టెక్కలి నియోజకవర్గం నిత్యం వార్తల్లో ఉంటోంది. ప్రస్తుతం బాధ్యతలు చూస్తున్న కుటుంబసభ్యుల వ్యవహారం రెండు పిల్లులు, కోతి కథ గుర్తుకుతెస్తుంది. ఆ కుటుంబసభ్యులకు టిక్కెట్ ఇవ్వాలన్న ప్రతిపాదనలకు అన్ని దారులూ మూసుకుపోయాయని విశ్వసనీయంగా తెలిసింది. ఉత్తరాంధ్ర సమన్వయకర్త సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ సారథ్యంలో జిల్లాకు చెందిన ముఖ్య నేతలిద్దరూ కలిసి కొత్త అభ్యర్థి వేట ప్రారంభించినట్లు సమాచారం. స్థానికంగా ఉన్న నేతలే కాకుండా కొత్తగా రాజకీయ ప్రవేశం చేసే వారినీ వెతుకుతున్నట్లు తెలిసింది.



ఇదే సమయంలో జిల్లాలో టిడిపి నేతలు జనసేన పొత్తుతో ఆశలు కలల్లో విహరిస్తున్నట్లు కనిపిస్తోంది. జనసేన పొత్తు ప్రకటన తర్వాత నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించినా కలిసి కార్యక్రమాలు చేయడానికి సంసిద్ధంగా లేనట్లు కనిపిస్తుంది. పవన్ కళ్యాణ్ సినిమా గ్లామర్‌తో ఓట్లు రావాలి తప్ప ఆ పార్టీకి జిల్లాలో నిర్మాణం ఏముందని టిడిపి నేతలే చెప్తున్నారు. ఏ నియోజకవర్గంలోనూ రాజకీయ పలుకుబడి, సామాజిక బలం, అర్థబలం ఉన్న నేతలు కాగడా పెట్టి వెతికినా కనిపించడం లేదని, వారి వల్ల మాకేంటి లాభమని ప్రశ్నించే టిడిపి నేతలే ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. జిల్లాకు ఈనెల పదో తేదీన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు రానున్నట్లు సమాచారం. టిక్కెట్ల తొలి జాబితాలో ఇచ్ఛాపురం, టెక్కలి, ఆమదాలవలస అభ్యర్థులను ప్రకటించే పరిస్థితి ఉంది. ఇప్పటివరకు ఆరు హామీల పత్రం విడుదలైంది తప్ప దాన్ని ప్రచారం చేయడంలో టిడిపి నేతలు సఫలీకృతులు కాలేకపోయినట్లు కనిపిస్తోంది. గత పాలనా అనుభవాల రీత్యా చంద్రబాబు హామీలపై ప్రజల్లో విశ్వసనీయత అంతగా కనిపించడం లేదన్న విమర్శల వర్షం ఎక్కువైంది. ఆ వర్షం వరదలా కొట్టుకుపోతున్నాయి తప్ప దాన్ని నిలువరించి విశ్వసనీయత పెంచే ప్రత్యామ్నాయ రాగం వినిపించడం లేదు. ఒక విశ్లేషకుడు అన్నట్టు రాష్ట్రంలో బిజెపి బలంగా ఉంది. ఎందుకుకంటే వైసిపి, టిడిపి నుంచి ఎవరు గెలిచినా 25 మంది ఎంపీలు బిజెపికి భజన చేయడమే. ఈ భజనకు చరమగీతం పాడితేనే రాష్ట్ర, జిల్లా భవిష్యత్ బాగుపడుతుంది.

– సత్తారు భాస్కరరావు

టెక్కలి అభివృద్ధి కనిపించడం లేదా?

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి, టెక్కలి

టెక్కలి నియోజకవర్గంలో 2014 నుంచి 2019 మధ్యకాలంలో జరిగిన అభివృద్ధి నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లా మొత్తానికి కళ్లెదురుగా కనిపిస్తుంటే వైసిపి నాయకులకు మాత్రం కనిపించడం లేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌డిఒ కార్యాలయం రైల్వేగేటు నుంచి అంబేద్కర్ జంక్షన్ మెయిన్ స్ట్రీట్ మెళియాపుట్టి రహదారి, అంబేద్కర్ జంక్షన్ నుండి ఇందిరాగాంధీ జంక్షన్ రహదారి, జగతిమెట్ట నుండి పాతజాతీయ రహదారిని నాలుగు వరుసల రహదారితో పాటు సెంటర్ లైటింగ్, ప్లాంటేషన్, ఎంపిడిఒ, సిఐ కార్యాలయం, పోలీసు స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం ఇలా చెప్పుకుంటూ పోతే 2014 నుంచి 2019 మధ్య కాలంలో అభివృద్ధి జరిగిందని, వైసిపి నాయకులు ఒక్క అభివృద్ధి పనైనా పత్రికల ద్వారా చెప్పుకోగలరా అని ప్రశ్నించారు. ఈ విషయం టెక్కలి నియోజకవర్గ ప్రజలు ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఎస్ఎస్ పిఒగా రమేష్‌సాహు

రమేష్ సాహు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారిగా రమేష్ సాహు నియమితులయ్యారని ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు తెలిపారు. అంబేద్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మురపాన అనూరాధ అధికారిక శనివారం ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. గతంలో ప్రోగ్రాం అధికారిగా పనిచేసిన దుగ్గివలస రాంప్రసాద్ నరసన్నపేటకు బదిలీ కావడంతో ఖాళీ అయిన ఈ పోస్టులో రమేష్ సాహుని ఎంపిక చేసినట్లు చెప్పారు. జంతుశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తోన్న రమేష్ సాహు ప్రోగ్రాం అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సేవాభావం, సామాజిక అంశాలపై అవగాహన ఉన్న రమేష్ సాహూ పిఒగా బాధ్యతలు చేపట్టడంపై అధ్యాపకులు నాగేంద్ర, రామకృష్ణ, ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, వినోద్‌రాజు, విజయ్ అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ సాహు మాట్లాడుతూ కళాశాల పరిధిలో దత్తత తీసుకున్న గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించేలా కృషి చేస్తామన్నారు. తనకు అవకాశం కల్పించిన కో-ఆర్డినేటర్ అనూరాధకు, ప్రిన్సిపాల్ భూషణరావుకు, ఆమదాలవలస సీనియర్ ప్రోగ్రాం అధికారి జలుమూరు రవిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గోపాల్‌దాస్ నాయుడు

సరస్వతి దేవి విగ్రహావిష్కరణ

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం పారాపురం గ్రామానికి చెందిన తోట అప్పారావు, విజయ లక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు విశ్రాంత అధ్యాపకుడు తోట గోపాలరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎద్దు గోపాల్ దాస్ నాయుడు సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంధాలయ జిల్లా మాజీ అధ్యక్షుడు తోట నందకుమార్, తోట కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ బి.రవికుమార్, ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, అధ్యాపకులు కె.గోవిందరావు, బి.లక్ష్మీనారాయణ, రామరాజు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ధాన్యం రాశులను పరిశీలిస్తున్న తహశీల్దార్ సరోజిని

తుపానుపై అప్రమత్తం

ప్రజాశక్తి - రణస్థలం

ఈ నెల 3, 4, 5 తేదీల్లో తుపాను కారణంగా భారీవర్ష సూచన ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ కోరారు. పూరిళ్లు, మట్టి ఇళ్లలో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు వరికుప్పలు, ధాన్యం జాగ్రత్త పర్చుకోవాలని, మత్స్యకారులు ఎవరూ సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా స్థానిక సచివాలయం లేదా తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. గ్రామాల్లో విఆర్ఒలు అందుబాటులో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు మండల అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

పోలాకి: ప్రజలు తుఫాన్ ప్రభావానికి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కె.శ్రీరాములు తెలిపారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తహశీల్దార్ కార్యాలయంలో 2 నుంచి 5 వరకు ప్రత్యేక టీంలతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నాలుగు రోజులు ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లవద్దని, ఈదురు గాలులు వీస్తున్నాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగితే వెంటనే సంబంధిత విఆర్ఒలకు సమాచారం అందించాలన్నారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నెంబర్ 9440731373 నెంబర్‌కు తెలియచేయాలని కోరారు. సమావేశంలో డిటి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఆర్ఐ సతీష్, విఆర్ఒలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మిచౌంగ్ తుఫాను సమీపిస్తున్న తరుణంలో ప్రస్తుతం రైతులు కోతకు వచ్చిన వరి చేనుకోవాలని తహశీల్దార్ పి.సరోజిని సూచించారు. 3,4,5 తేదీల్లో అధికంగా వర్షాలు పడే అవకాశం ఉందని తెలియజేశారు. అలాగే వరి కోసిన వరి పనలు జాగ్రత్తగా కుప్పలు కట్టి టార్పాలిన్లు కప్పుకోవాలన్నారు. నూర్చిడి చేసిన ధాన్యాన్ని సురక్షితమైన, ఎత్తైన ప్రదేశాల్లో నిల్వచేసి టార్పాలిన్లు కప్పుకోవాలని రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టుపురం, శేఖరాపురం రైతులకు కల్లాల వద్ద నూర్చిడి చేసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దాన కర్ణుడు, వ్యవసాయ సహాయకులు శరత్ కుమార్ రెడ్డి, జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ గణపతిరావు

ధాన్యం సేకరణపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులు పండించిన ధాన్యం సేకరణ విషయంలో అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించరాదని తహశీల్దార్ ఎస్.గణపతిరావు అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, రైతుభరోసా కేంద్రం ఉద్యోగులకు ధాన్యం సేకరణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం సేకరించేటప్పుడు నాణ్యత పరిశీలన, మద్దతు ధర గుర్తించేటప్పుడు రైతుకు ఎటువంటి నష్టం లేకుండా సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ధాన్యం విక్రయించే రైతుల వివరాలను ముందుగా రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేయాలని, జిపిఎస్ ఏర్పాటు చేసిన వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, పౌర సరఫరాల శాఖ డిటి దువ్వాడ అమర్నాథ్ పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

శ్రీకాకుళం జిల్లా పరిషత్ రోడ్డులో ఎపిటిఎఫ్ పాత కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఎపిటిఎఫ్ నూతన భవన శంకుస్థాపన జరుగుతుందని, అనంతరం ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో బహిరంగ సమావేశం జరుగుతుందని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.కరుణాకర్ శనివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో సిక్కోలును ప్రముఖ స్థానంలో నిలబెట్టిన ఘనత ఎపిటిఎఫ్ కార్యకర్తల దేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి రమేష్‌బాబు, సనపల మురళీధర్ ఉన్నారు.

యువజన విభాగాలు మరింత బలోపేతం

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

మాట్లాడుతున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా జిల్లా యువజన విభాగం, అనుబంధ విభాగాలు పనిచేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎం.వి.స్వరూప్ అధ్యక్షతన నగరంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో శనివారం వైసిపి యువజన విభాగం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సిఎం జగనకే దక్కుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు పూర్తిస్థాయిలో న్యాయం చేసిన జగన్ అని కొనియాడారు. స్వరూప్ మాట్లాడుతూ సచివాలయానికి 20 మంది చొప్పున, మండలానికి 500 మంది, నియోజకవర్గానికి రెండు వేల మందితో నియోజకవర్గ యువజన కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. వీరంతా జగనన్న సైనికులుగా ఓ సమూహంలా తయారై పార్టీ బలోపేతానికి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. మండలానికి ఒక జనరల్ సెక్రెటరీతో, ఇద్దరు సెక్రటరీలతో, ఇద్దరు ఉపాధ్యక్షులతో కలిసి ఐదుగురితో మండల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా సమస్యలను ఎంపీ రామ్మోహన్ నాయుడు గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. సమావేశంలో వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, నక్క రామరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పోలాకి : నరసన్నపేట మండలం చిక్కాలవలస, పోలాకి మండలంలో సొసైటీ ఆధ్వర్యంలో సచివాలయం పరిధి రైతు భరోసా కేంద్రంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి నాయకులు కణితి కృష్ణారావు, సొసైటీ సిఇఒ రాంబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు పోన్నాన దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

స్విమ్మింగ్‌పూల్ నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలో స్విమ్మింగ్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్విమ్మింగ్‌పూల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. గతనెల తిరుపతిలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 3వ స్థానం సాధించిన స్విమ్మింగ్ క్రీడాకారులు సింహాచలం బెహరా, గోవింద్ బెహరా, తరుణ్ బెహరాలను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లు, మెడల్స్ బహుకరించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులతో మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి స్విమ్మింగ్ క్రీడల్లో విద్యార్థులు, యువత ఆసక్తి చూపుతున్నారని, స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని రానిస్తున్నారన్నారు. పట్టణంలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం కొరకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ నీలాపు ఢిల్లీ, స్విమ్మింగ్ కోచ్ బత్తుల రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

ఓటరు నమోదుపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

18 ఏళ్లు నిండిన యువఓటర్లు తమ ఓటుహక్కును నమోదు చేసుకోవడానికి ముందుకు రావాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. శనివారం పూండి కూడలిలో సాయి వినీత్ జూనియర్, డిగ్రీ కళాశాల, డైట్ కళాశాల విద్యార్థులతో ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు కొత్త ఓటు నమోదుపై అవగాహన కల్పించి అనంతరం మానవహారం నిర్వహించారు. ఓటుహక్కుతోనే భవిష్యత్ మారుతుందన్నారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 నమోదు కేంద్రంలో ఇవ్వాలని లేని పక్షంలో ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని విద్యార్థులకు తెలిపారు. ఓటరు నమోదుపై ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, డిటి గిరిరాజు, ఆర్ఐ పవిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ అన్నెపు కైలాష్‌రావు, అధ్యాపకులు శ్రీనివాసరావు, షణ్ముఖరావు, సాయిగోపాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ప్రస్తుతం ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.సరోజిని అన్నారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్ల నమోదుపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా తప్పులుంటే వాటిని సరిచేసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

ఈ నెల 9న స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించు జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు బి.జ్యోత్స్న కోరారు. శనివారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాలపై జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్ కేసులు, భార్య, భర్తల తగాదా కేసులను చర్చలు జరిపి రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. లీగల్ అవేర్నెస్ కార్యక్రమం ద్వారా 185 ఎంవి యాక్ట్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై అవగాహన కల్పించాలని సూచించారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

పల్లెలే ప్రగతికి పట్టుకొమ్మలు

కవిటి : పల్లెలు బాగున్నప్పుడే పాలన బాగుంటుందని, పల్లెలే ప్రగతికి పుట్టుకొమ్మలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలం రాజపురం గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.2.5లక్షలతో సిసి రోడ్ నిర్మాణానికి ఎమ్మెల్సీ శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే నియోజకవర్గాలు బాగుంటాయన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని సిఎం గ్రామస్థాయి నుంచే పక్కాగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారని తెలిపారు. ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ సనపల జానకిరావు, ఎంపిటిసి సనపల కృష్ణారావు, నాయకులు సత్యనారాయణ పాడి, ఎన్ని అశోక్ పాల్గొన్నారు.

కరువు మండలాలుగా గుర్తించాలని వినతి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీలోనూ తీవ్రమైన కరువు ఛాయలు అలుముకున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే వీటిని కరువు మండలాలుగా ప్రకటించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే కవిటి మండలం రాపాకపుట్టుగ పాఠశాలకు అదనకు భవనం మంజూరు, ఇచ్ఛాపురం ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రం మంజూరు చేయాలని కోరారు.

ఆందోళన చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

ల్యాబ్ టెక్నీషియన్ల ఆందోళన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పి.సూర్యకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు ఉద్యోగోన్నతులు కల్పించడం లేదన్నారు. జూనియర్ ఎనలిస్టులుగా ఉద్యోగోన్నతి కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తున్నామన్నారు. గ్రేడ్-1 ల్యాబ్ టెక్నీషియన్లుగా ఉద్యోగంలో చేరి సర్వీసు పూర్తి చేసినా అదే స్థాయిలో ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాబ్ టెక్నీషియన్లకు ఉద్యోగోన్నతులు కల్పించకుండా 2017లో ఫార్మాసిస్టులకు జూనియర్ ఎనలిస్టులుగా ఉద్యోగోన్నతి కల్పించారన్నారు. దీనివల్ల ల్యాబ్ టెక్నీషియన్లకు తీరని నష్టం వాటిల్లుతోందన్నారు. తక్షణమే ప్రభుత్వం ల్యాబ్ టెక్నీషియన్లకు ఎనలిస్టులుగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్.లక్కీ ఈశ్వరు, అసోసియేట్ ప్రెసిడెంట్ సుజాత, అధ్యక్షులు కృష్ణ, ట్రెజరర్ కేశవ, రాజారావు పాల్గొన్నారు.

సోంపేట : ఎన్నికైన నూతన కార్యవర్గం

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- సోంపేట

స్థాని ప్రభుత్వ పాఠశాలలో మందస మండలం యుటిఎఫ్ శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం నిర్వహించారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా కె.తెజేశ్వరరావు, అధ్యక్షుడిగా జగదీష్ బడిత్య, సహాధ్యక్షులుగా ప్రియాంక, జి.గోపాలకృష్ణ, సిపిఎస్ కన్వీనర్‌గా డి.మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా డి.ఈశ్వరరావు, కోశాధికారిగా ఎస్.సోమనాధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు జిల్లా, మండల స్థాయి కన్వీనర్లను, ఆడిట్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం కోటబొమ్మాళిలో జరిగే సంఘ స్వర్ణోత్సవ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభ్యుల సహకారంతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు ఆర్.పరమేశ్వరరావు, జి.కోదండరావు, జి.రమేష్ పాల్గొన్నారు.

మండల శాఖ అధ్యక్షునిగా శరత్‌కుమార్

వజ్రపుకొత్తూరు: యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షుడిగా శరత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఎల్‌డి పేట మండల పరిషత్ పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ వజ్రపుకొత్తూరు మండలశాఖ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు బల్ల చిట్టిబాబు అధ్యక్షతన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా జి.రాజేశ్వరరావు, అధ్యక్షులుగా గోరకల శరత్ కుమార్, ఉపాధ్యక్షులుగా బొత్స శోభారాణి, పి.హేమ సుందరరావు, ప్రధాన కార్యదర్శిగా కంచరాన జయరాం, మహిళా కార్యదర్శిగా కింతలి సుజాత, మహిళా కమిటీ కన్వీనర్‌గా జి.సత్యవతి, ట్రెజరర్‌గా శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లుగా ధనుంజయరావు, శ్రీనివాసరావు, ధర్మారావు, ఢిల్లేశ్వరరావు, తిరుపతి రావు, గౌరవ సలహాదారులుగా రామచంద్రుడు, మెట్ట మోహనరావులను ఎన్నుకున్నారు.

రాజ్యాంగ లక్ష్యాలకు తూట్లు

ప్రజాశక్తి- టెక్కలి

భారత రాజ్యాంగాన్ని కాపాడే బలమైన వ్యవస్థ కాంగ్రెస్ పార్టీదేనని, కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందని డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతు రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను కేంద్రంలో బిజెపి విస్మరించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఫలితంగా దేశంలో నిరుద్యోగం పెరుగుతుందని విమర్శించారు. అంతకు ముందు డిసిసి అధ్యక్షులుగా భాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు తలగాం సూర్యం పేడాడ పరమేశ్వరరావుని సత్కరించారు. నిరుద్యోగ పోరాట సమితి పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కిసాన్ సంఘం అధ్యక్షులు కోత మధుసూదనరావు, దళిత సంఘం నాయకులు అక్కురాడ మాధవరావు, ఉమాశంకర్, ప్రదీప్, ధనుంజయ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పరమేశ్వరరావు

'ఆడుదాం ఆంధ్రా'కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతాల్లో యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం 15 ఏళ్లు నిండిన అందరి కోసమని వైఎస్ఆర్ క్రాంతిపథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. శనివారం పట్టణంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పురుషులతో పాటు మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలో తమ పేర్లను సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మహిళా సంఘ సభ్యులు పిల్లలందరినీ క్రీడాస్ఫూర్తితో ఎక్కువ మందిని భాగస్వాములుగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలతో పాటు గ్రామ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

బాలికలను చదివిద్దాం

ప్రజాశక్తి- పలాస

బాల్యవివాహాలు విడనాడాలని ఎంపిడిఒ రమేష్ నాయుడు అన్నారు. శనివారం మండలంలో గత రెండు వారాలుగా 19 పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. లింగ వివక్షత లేకుండా చేయాలని, బాల్య వివాహాలు తగ్గించాలని, మహిళల్లో రక్తహీనత లేకుండా చేయాలని, ఆడపిల్లలను చదివించాలని అవగాహన, ప్రతిజ్ఞలు, ర్యాలీలు పెద్దసంఖ్యలో నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎపిఎం మల్లేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలో గుమ్మాడం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ముప్పిడి రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అలాగే ఎచ్చెర్ల వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అలాగే వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాగం కనకరాజు, ముప్పిడి జన, మీసాల జగన్, శ్రీరాములు, సత్యన్నారాయణ, అమర్నాథ్ ఉన్నారు.


సూచనలు ఇస్తున్న సిఐ రమేష్‌కుమార్

తీర ప్రాంతంలో రక్షణ చర్యలు

సోంపేట: కార్తీక వనభోజనాలు, పిక్నిక్‌ల నేపథ్యంలో తీర ప్రాంతంలో ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నట్లు బారువ మెరైన్ సిఐ రమేష్ కుమార్ తెలిపారు. బారువ స్టేషన్‌లో సిబ్బందికి శనివారం సూచనలు చేశారు. ఆదివారం నుంచి తీరప్రాంతాలకు సందర్శకుల తాకిడి పెరగనున్న నేపథ్యంలో రక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సందర్శకులు సైతం పోలీసులకు సహకరించాలని కోరారు. నిర్మాణ్య ప్రదేశాల్లో సంచరించకూడదని, స్నానాలాచరించేటప్పుడు పోలీసుల సూచనలు పాటించాలని విన్నవించారు. సాయంత్రంలోగా తిరుగు ప్రయాణాలకు సిద్ధం కావాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బారువ, రట్టి, పొక్కలపాలెం బీచ్‌లో బందోబస్తుకు సిబ్బందిని సైతం నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వారోత్సవాలు

శ్రీకాకుళం అర్బన్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కంప్యూటర్ విద్య కీలకమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో అంతర్జాతీయ కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవం వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ ఆధ్వర్యాన విద్యార్థులకు వీడియో మేకింగ్ టూల్స్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని తెలుగు చలన చిత్ర గాయని నిఖితా శ్రీవల్లి కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో స్వామివారి శేష వస్త్రాలను అందజేసి చిత్రపటాన్ని ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు అందజేశారు.

జంతు ఆరోగ్యకార్డులు అందజేయాలి

పలాస : రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు జంతు ఆరోగ్య కార్డులు అందజేయాలని జిల్లా వెటర్నరీ వైద్యుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ డి.శ్రీకాంత్, చంద్రశేఖరరావు అన్నారు. శనివారం పలాస ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, పారావెట్స్, ఎహెచ్ఎలు, గోపాలమిత్రలతో నెలవారీ సమీక్ష నిర్వహించారు.

పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ప్రసాద్

కోటబొమ్మాళి: మండలం తిలారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ ఎం.ప్రసాద్ అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో అమలవుతున్న వివిధ జాతీయ కార్యక్రమాల అమలు తీరును ఆయన పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటి (హెచ్‌డిఎస్) నిధులను ఆస్పత్రి అభివృద్ధికి వెంటనే ఖర్చు చేయాలని ఆదేశించారు. పర్యవేక్షణ సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ గ్రామస్థాయి వైద్య సిబ్బందికి సూచనలు ఇవ్వాలని, ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష్యాలు అమలయ్యేలా ప్రతిఒక్కరు పాటు పడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి సంబంధించిన పలు రికార్డులను, వైద్య పరికరాలను, మందులు తదితర అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు మనీష, డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న పంచావన్ రౌలో

జగన్నాథస్వామి ఆలయం ముస్తాబు

ప్రజాశక్తి- కవిటి

మండల కేంద్రంలో బెహరా వీధిలో అతి పురాతమైన శ్రీ జగన్నాథస్వామి ఆలయం భక్తులు, దాతలు సహకారంతో శరవేగంగా పున:నిర్మాణం జరుపుకుంటున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పంచావన్ రౌలో శనివారం ఆలయ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న మండపం శ్లాబుకు అవసరమైన 500 బస్తాల సిమెంట్, ఇనుము అందిస్తానని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికే చాలా వరకు నిర్మాణ పనులు జరిగాయని, ఇంకా జరగాల్సిన పనులు చాలా ఉన్నాయన్నారు. ఆలయ నిర్మాణం పూర్వవ్వడానికి ప్రతిఒక్క దాత సహకరించాలన్నారు. కార్యక్రమంలో ధన్వంతర రౌలో, గిరి బెహరా, తిరుపతి బెహరా, జగపతి బెహరా, దేవా బెహరా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోర గోవిందరావు, పట్టణపార్టీ అధ్యక్షులు సంపతరావు మురళీరావు అన్నారు. శనివారం పురపాలక సంఘం పరిధిలో 20వ వార్డు వెంగళరావుకాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, యువతకు ఉపాధి లేక వలస పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బిసి కార్పోరేషన్లను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రెడ్డి గౌరీ, టిడిపి నాయకులు రెడ్డి రాంబాబు, గడ్డాపు రమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని గుమ్మాడం పంచాయతీలోని వాళ్లేపేటలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి మజ్జి రామ్మూర్తి, పోలినాయుడు, వి. గొల్ల, జె. దుర్గాప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లావేరు : పోస్టర్‌ను అందజేస్తున్న టిడిపి నాయకులు